# బోగస్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు

ఈ కబురు, హైదరాబాద్ : ఇంజనీరింగ్ ప్రవేశాలు కల్పిస్తున్న బోగస్ విద్యా సంస్థలపై ఉక్కుపాదం మోపుతామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ సంస్థలతో కుమ్మక్కయిన డీమ్డ్, ప్రైవేట్ యూనివర్సిటీలపైనా చర్యలు తప్పవన్నారు. ఈ అంశాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 'నైపుణ్యంగా నయా మోసం'పేరుతో 'సాక్షి'దినపత్రిక మే 27న ఓ కథనాన్ని ప్రచురించింది. అనుమతులు లేని సంస్థలతో కలిసి డీమ్డ్ వర్సిటీలు క్లాసులు నిర్వహించడాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనిపై ముఖ్యమంత్రి కార్యాలయం తీవ్రంగా స్పందించింది. వాటిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో మండలి అధికారులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మండలి చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ ఎస్‌కె మహమూద్, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఆ నాలుగు సంస్థలు...**

ఎలాంటి అనుమతి లేని నాలుగు సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ఏఐ ఎంఎల్ సహా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ప్రచారం చేస్తున్నాయని బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రైవేట్ లిమిటెడ్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సంస్థలు ఈ తరహా ప్రకటనలు ఇస్తున్నాయని స్పష్టం చేశారు. ఇవి మల్లారెడ్డి, అరోరా, చైతన్య ఇంజనీరింగ్ కాలేజీలతో ఒప్పందం చేసుకుంటున్నాయని, అడ్మిషన్లు ఈ కాలేజీల్లో తీసుకొని, క్లాసులు మాత్రం అనుమతి లేని విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇది పూర్తి చట్ట విరుద్ధమన్నారు.

ఈ సంస్థలకు ఈ నెల 3వ తేదీన నోటీసులు ఇచ్చామని, ఏ విధంగా ప్రవేశాలు కల్పిస్తున్నారు? అనుమతులు ఏమున్నాయి ? అనే పలు వివరాలు అడిగామని చెప్పారు. ఈ నెల 13వ తేదీనాటికి జవాబు చెప్పమన్నామని తెలిపారు. సమాధానం వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంస్థల్లో విద్యార్థులు చేరొద్దని చెప్పారు. ఈ తరహా కోచింగ్ సెంటర్ల వివరాలు కూడా సేకరిస్తున్నామని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

**వచ్చే నెల ఇంజనీరింగ్ కౌన్సెలింగ్**

జూలై మొదటి వారంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఇస్తామని బాలకిష్టారెడ్డి తెలిపారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి సూచనల మేరకు ఆగస్టు 14 నుంచి ఇంజనీరింగ్ కాలేజీల్లో క్లాసులు మొదలవుతాయని చెప్పారు. జోసా కౌన్సెలింగ్ రెండో దశ పూర్తయితే సీట్లపై స్పష్టత వస్తుందన్నారు. ఫీజుల నిర్ధారణపై ప్రభుత్వ అనుమతి రావాల్సి ఉందన్నారు. ఇంజనీరింగ్ యాజమాన్య కోటాను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్టు చెప్పారు. ఇంజనీరింగ్‌లో సీట్లు ఉన్నాయని, తొందరపడి ప్రైవేటు కాలేజీల్లో డొనేషన్లు కట్టి చేరొద్దని సూచించారు. ఉన్నత విద్యా మండలికి అవసరమైన అధికారాలు కల్పించాల్సిన అవసరం ఉందని, దీనికోసం తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ రిఫార్మ్ బిల్లును తేవాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చామన్నారు.

**మాక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తాం**

ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లపై అవగాహన కల్పించేందుకు జోసా తరహాలో మాక్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని బాలకిష్టారెడ్డి తెలిపారు. దీనికోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు సీట్లపై అవగాహన కల్పించేందుకు, సందేహాల నివృత్తికి కౌన్సెల్ ఆధ్వర్యంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొబైల్ ఫోన్ నంబర్‌కు విద్యార్థులు ఫోన్ చేస్తే అవసరమైన సమాచారం వస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షలను దిగ్విజయంగా ముగించామని, ఈ నెల 13న రెండో దశ దోస్త్ సీట్ల




# తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు బయటకు రావొద్దు!



ఈ కబురు: రాష్ట్ర ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గత రెండు మూడు రోజులుగా ఎండలు దంచికొట్టగా.. వాతావరణంలో ఒక్కసారిగా భిన్నమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో వాతావరణం చల్లబడింది. తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇవాళ(మంగళవారం) ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. నల్గొండ, మెదక్, వరంగల్ జిల్లాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, హైదరాబాద్, రంగారెడ్డి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చే మూడురోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం, తూర్పు దిశల నుంచి తెలంగాణ వైపునకు ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద ఉండరాదని తెలిపారు. ఈ క్రమంలో అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుంచి బయటకు రావొద్దని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

# కరోనాతో ఐదుగురు మృతి.. 6815కు చేరిన యాక్టివ్ కేసులు



**ఈ కబురు: దేశంలో కరోనా కేసులు వేగంగా పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో 324 కొత్త కేసులు నమోదు కాగా, కొవిడ్‌తో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దేశ వ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 6815కు చేరుకుంది. మరణించిన వారిలో కర్ణాటకకు చెందిన ఇద్దరు, కేరళ, ఢిల్లీ, జార్ఖండ్‌లకు చెందిన ఒక్కొక్కరు ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. కేరళలోనే అత్యధికంగా 2053 పాజిటివ్ కేసులున్నాయి. గుజరాత్ లో 1109, పశ్చిమ బెంగాల్‌లో 747, ఢిల్లీలో 691, కర్ణాటకలో 559, ఆంధ్రప్రదేశ్ లో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులున్నాయి. కొవిడ్ కేసుల పెరుగుదల నేపథ్యంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఇటీవల రాష్ట్రంలోని అన్ని ప్రధాన విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే కొవిడ్ మార్గదర్శకాలను పాటించాలని కేరళ ప్రభుత్వం అన్ని ఆస్పత్రులకు ఆదేశాలు జారీ చేసింది.**

# భారత్ స్వరాన్ని సగర్వంగా చాటారు



ఈ కబురు,ఢిల్లీ: ఉగ్రవాద ముప్పును సమూలంగా పెకిలించి వేయాల్సిన ఆవశ్యకతను ప్రపంచ దేశాలకు అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు వివరించిన తీరు తనకెంతో గర్వంగా ఉందని ప్రధాని మోదీ ప్రశంసించారు. 'ఆపరేషన్ సిందూర్' తదితర పరిణామాలను వివరించేందుకు వివిధ దేశాల్లో పర్యటించి వచ్చిన ఏడు బృందాల ప్రతినిధులతో మోదీ మంగళవారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతినిధులు తమ పర్యటన విశేషాలను ప్రధానికి వివరించారు. 'భారత దేశం శాంతిని కోరుకుంటుందని, ప్రపంచానికి పొంచి ఉన్న ఉగ్రవాద ముప్పును తొలగించాల్సిన అవసరముందని వివిధ దేశాలకు మన బృందాలు వివరించిన తీరు అద్భుతం' అని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రధానికి కృతజ్ఞతలు. అని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. తమకు కీలకమైన బాధ్యతలను అప్పగించినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపినట్లు ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే పేర్కొన్నారు. భాజపా ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, డీఎంకే ఎంపీ కనిమొళి, శివసేన ఎంపీ శ్రీకాంత్ శిందే, జేడీ(యూ) ఎంపీ సంజయ్ కుమార్ ఝా, ఎన్సీపీ(ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే నేతృత్వంలోని అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు ఆయా దేశాల్లో పర్యటించి పాకిస్థాన్ తీరును ఎండగట్టిన విషయం తెలిసిందే.

# నేలపై పడేసి.. చేతులను వెనక్కి విరిచిపెట్టి..




**అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారతీయ యువకుడిని భద్రతాధికారులు నేలపై పడేసి.. చేతులను వెనక్కి విరిచిపెట్టి బంధించారు.**

**భారతీయుడిపై అమెరికా అధికారుల కాఠిన్యం**

**ఈ కబురు,నెవార్క్, న్యూయార్క్: అమెరికాలోని నెవార్క్ విమానాశ్రయంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భారతీయ యువకుడిని భద్రతాధికారులు నేలపై పడేసి.. చేతులను వెనక్కి విరిచిపెట్టి బంధించారు. అతడిని భారత్‌కు తిప్పి పంపారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోను కునాల్ జైన్ అనే సోషల్ ఆంత్రప్రెన్యూర్ ఎక్స్‌లో పోస్టు చేశారు. భారతీయ ఎంబసీని, విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్‌ను ట్యాగ్ చేశారు. దీనిపై వివరాలను సేకరిస్తున్నామని, స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నామని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా సోమవారం వెల్లడించింది. 'యువ భారతీయుడిని (విద్యార్థి అనుకుంటా) గత రాత్రి భారత్‌కు తిప్పి పంపారు. అతడి చేతులకు బేడీలు వేశారు. నేలపై పడేసి చేతులను వెనక్కి విరిచిపెట్టారు. అతడు ఏడుస్తున్నారు. ఒక ప్రవాస భారతీయుడిగా నేను ఈ సమయంలో నిస్సహాయుడిగా మిగిలిపోయా. నా గుండె పగిలింది. ఇది మానవ విషాదం' అని ఈ నెల 8న ఎక్స్‌లో పెట్టిన పోస్టులో కునాల్ పేర్కొన్నారు. బాధితుడు హరియాణ్వీ మాట్లాడుతున్నారని వెల్లడించారు. భారతీయ ఎంబసీ, కేంద్రమంత్రి జైశంకర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. విద్యార్థిని అమానుషంగా బంధించిన ఘటనపై సామాజిక మాధ్యమాల్లో వైరలవుతున్న వీడియోపై వివరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నామని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ) వెల్లడించింది.**

# ఎంట్రీ లెవల్‌కూ ఏఐ సవాల్!




మొత్తంగా ఎంట్రీ లెవెల్ (తొలి స్థాయి)ఉద్యోగార్థులు, గ్రాడ్యుయేట్లకు డిమాండ్ భారీ ఎత్తున తగ్గిపోతోంది. రాను రాను మొదటి ఉద్యోగం దొరకడం అనేది కష్టంగా, సవాళ్లతో కూడుకున్నదిగా మారుతోంది. ఇప్పటికే వివిధ రంగాలలో పని చేస్తున్న ఉద్యోగుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), తాజా గ్రాడ్యుయేట్లు తమ తొట్టతొలి కొలువు దక్కించుకోవడాన్ని కూడా కష్టసాధ్యం చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు, కంపెనీలకు అవసరమైన డాక్యుమెంట్ల విశ్లేషణ, సమావేశాలకు అవసరమైన బ్రీఫింగ్ నోట్స్ తయారీ, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ (పీపీపీ) రూపకల్పన, కస్టమర్ల నుంచి వచ్చే ఫిర్యాదులు లేదా ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం వంటి పనులను ఏఐ సులువుగా చక్కబెట్టేస్తుండటమే ఇందుకు కారణం.

ఏఐతో నెట్టుకొచ్చేస్తున్న కంపెనీలు..

కొత్తగా ఉద్యోగాల్లో చేరే యువత తమ కెరీర్ మొదట్లో ఎక్కువగా ఈ తరహా పనులే చేస్తుంటారు. అయితే ప్రస్తుతం ఏఐ ప్రపంచాన్ని శాసిస్తోంది. అన్ని రంగాల్లోకి చొచ్చుకుపోతోంది. ఉద్యోగాలకు ఎసరు తెస్తోంది. కంపెనీలు కూడా ఖర్చును దృష్టిలో పెట్టుకుని కృత్రిమ మేధ వైపు మొగ్గుతున్నాయి. ఈ క్రమంలోనే ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు సైతం తగ్గిపోతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్'ఉన్నతోద్యోగి ఒకరు.. 'రాబోయే రోజుల్లో కృత్రిమ మేధ అనేది అన్ని వైట్ కాలర్ జాబ్ (కార్యాలయాల్లో కూర్చుని పనిచేసే ఉద్యోగం)ల్లో సగానికి సగం ఎంట్రీ లెవల్ జాబ్‌లను తుడిచి పెట్టేస్తుంది..'అంటూ ఇటీవల చేసిన ప్రకటనను వారు ప్రస్తావిస్తున్నారు. ఈ పరిస్థితికి తగ్గట్టుగానే జూనియర్ లేదా ఎంట్రీ లెవల్ ఉద్యోగిగా ఉపయోగించుకోవడాన్ని ఆచరణలో పెట్టేయడం గమనార్హం. కాగా వివిధ రంగాలకు సంబంధించిన ఎంట్రీ లెవల్ జాబ్‌లకు డిమాండ్ తగ్గుదలను తాము గమనించామని లండన్‌లోని రిక్రూట్‌మెంట్ సంస్థ 'ఫ్రెష్ మైండ్స్'ప్రతినిధులు ఇటీవల వెల్లడించడాన్ని కూడా నిపుణులు గుర్తు చేస్తున్నారు. తమ సంస్థల్లో చేరబోయే ఉద్యోగులు 'వర్క్ రెడీ ప్రొఫెషనల్స్'గా ఉండాలని ఆయా సంస్థలు కోరుకుంటున్నాయని వారు తెలిపారు. కొన్ని కంపెనీలు జూనియర్ పోస్టులను సైతం సీనియర్ ఉద్యోగులతో భర్తీ చేస్తున్న ఉదంతాలను వెంచర్ క్యాపిటల్ సంస్థ సిగ్నల్ ఫైర్ తన 'స్టేట్ ఆఫ్ టాలెంట్ 2025'నివేదికలో ప్రస్తావించింది.

సంసిద్ధులుకావాల్సిందే..: నిపుణులు

ప్రస్తుత పరిస్థితులన్నీ ఫ్రెష్ గ్రాడ్యుయేట్లు మొదటి ఉద్యోగం సాధించడాన్ని సమస్యాత్మకంగా మారుస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. నవ యువత సాంకేతికంగా ఒక అడుగు ముందుకేసి తమకు సవాళ్లు విసురుతున్న వ్యవస్థలను అధిగమించేందుకు సంసిద్ధులై ఉండాలని సూచిస్తున్నారు. కృత్రిమ మేధనే ఓ ఆయుధంగా మలుచుకోవాలని చెబుతున్నారు. చాట్ జీపీటీ, గ్రోక్, తదితరాలను ఉపయోగిస్తూ తమపై పడే పనిభారాన్ని తగ్గించుకోవడంతో పాటు విధుల నిర్వహణలో వేగంగా ముందుకు సాగాలని స్పష్టం చేస్తున్నారు.

సిద్ధమే అంటున్న యువత..

తాజాగా యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్ ప్రొఫెసర్ ఒకరు.. సింగపూర్ నేషనల్ యూనివర్సిటీకి చెందిన 70 మంది ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ విద్యార్థులను ఏఐతో, ఎంట్రీ లెవల్ జాబ్స్ విషయంలో ఎదురవువారికి రావాల్సిన ఉద్యోగాల్లో భారీగా కోతగా ఏర్పడబోతోందా? ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారు? అని అడిగారు. పలువురు విద్యార్థులు స్పందిస్తూ.. ఏఐ వల్ల తమకు నష్టం జరుగుతుందని భావించడం లేదని చెప్పారు. తాము ఏఐనే ఓ సాధనంగా ఉపయోగించుకుని పని ప్రదేశాల్లో రాణించేందుకు సిద్ధమంటూ సమాధానమిచ్చారు. ఏఐ టూల్స్ వినియోగంలో తాము పైచేయి సాధించినందున తమకు పెద్దగా సమస్య ఎదురుకాబోదని అన్నారు. తమలో అత్యధికులు ఒక్క చాట్ జీపీటీనే కాకుండా... జెమిని, క్లాడ్, ఫైర్‌ఫ్లై, హేజెన్, గామా, హిగ్స్‌ఫీల్డ్, యుడియో, నోట్‌బుక్ ఎల్‌ఎం, మిడ్ జర్నీ వంటి వివిధ రకాల టూల్స్‌ను ఉపయోగిస్తున్నామంటూ ప్రశ్న అడిగిన ప్రొఫెసరే ఆశ్చర్యపోయేలా సమాధానమివ్వడం.. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా యువతలో వస్తున్న మార్పునకు సంకేతమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

యువతను ప్రోత్సహిస్తే కంపెనీలకే మేలు

కంపెనీలు కూడా ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా ఎంట్రీ లెవల్ జాబ్‌లను ఏఐకు అప్పగించకుండా యువతకున్న టాలెంట్‌ను ఉపయోగించుకోవడం వల్ల అదనపు ప్రయోజనాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. చేసే పనికి సృజనాత్మకతను జోడించి కొత్త ఆవిష్కరణలు చేసేలా యువతను ప్రోత్సహించడం వల్ల కంపెనీలకే మేలు జరుగుతుందని చెబుతున్నారు. కేవలం ఏఐ టూల్స్ వినియోగానికి పరిమితమవుతూ ఎక్కువ ఉత్పాదకత సాధనపై దృష్టి పెట్టకుండా వ్యూహాత్మకంగా, క్రియాశీలంగా పని చేసే వర్క్‌ఫోర్స్‌ను పెంపొందించుకుంటే అన్ని విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు.

# మోయలేనంత భారమేమి కాదు.. బస్ పాస్ ధరల పెంపుపై మంత్రి పొన్నం క్లారిటీ

**ఈ కబురు: తెలంగాణలో పెరిగిన బస్ పాస్ ధరలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. టోల్ ట్యాక్స్ లను కేంద్ర ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో ఆ నష్టాన్ని పూరించుకునేందుకు టోల్ ట్యాక్స్ రూట్లలో మాత్రమే బస్ పాస్ చార్జీలు పెంచామని చెప్పారు. హైదరాబాద్ లో ఇక నుంచి విద్యార్థులకు మెట్రో ఎక్స్ ప్రెస్ ల్లో కూడా ప్రయాణ సౌకర్యం కల్పించామని అందువల్లే ఇక్కడ కూడా కాస్త బస్ పాస్ చార్జీలు పెంచామన్నారు. కొన్నేళ్లుగా బస్ పాస్ చార్జీలు పెంచలేదని మహాలక్ష్మి స్కీమ్ ఉచిత ప్రయాణం కింద రూ. 6 వేల కోట్లు ఆర్టీసీకి ఇచ్చామన్నారు. మహాలక్ష్మి స్కీమ్ కారణంగా ఆర్డీనరీ బస్సుల్లో విద్యార్థులు ప్రయాణించడం ఇబ్బందిగా మారిందని అందువల్ల వారికి మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లోనూ అనుమతి ఇస్తున్నామన్నారు. పెంచిన చార్జీలు వారు మోయలేనంత భారమైనదేమి కాదని అన్నారు. పెరుగుతున్న అన్ని రకాల ధరల వల్ల స్వల్పమార్పులు చేశామన్నారు. ఒక వేళ కేంద్ర ప్రభుత్వం టోల్ ట్యాక్స్ తగ్గిస్తే ఒకే నిమిషంలో ఆ రూట్లలోని బస్ పాస్ చార్జీలను తగ్గించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.**



# రూ.20లక్షల సుపారీ ఇచ్చి..భర్తను లోయలోకి తోసేందుకు సహకరించి..!



ఈ కబురు: మేఘాలయలో నవ వధూవరులు అదృశ్యమైన కేసులో వధువు సోనమే పథకం ప్రకారం కిరాయి హంతకులతో భర్త రాజా రఘువంశీని హత్య చేయించినట్లు ప్రాథమికంగా వెల్లడైంది. ఈ కేసులో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆ నిందితులకు ఆమె లక్షల రూపాయల డబ్బు ఆఫర్ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి రాజా రఘువంశీని హత్య చేసేందుకు తొలుత కిరాయి హంతకులకు సోనమ్ రూ.4లక్షలు ఇవ్వజూపిందని సమాచారం. తర్వాత ఆ మొత్తాన్ని రూ.20లక్షలకు పెంచిందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. అలాగే తన భర్త మృతదేహాన్ని లోయలో విసిరేసేందుకు నిందితులకు సహకరించిందని పేర్కొన్నాయి. మే 11న రాజా రఘువంశీతో సోనమ్‌కి వివాహం జరగ్గా.. 20న హనీమూన్ కోసం ఈ నవ దంపతులు మేఘాలయకు వెళ్లారు. మే 23 నుంచి వారి ఆచూకీ గల్లంతైంది. అదృశ్యమైన 11 రోజుల తర్వాత రఘువంశీ మృతదేహాన్ని సోహ్రాలోని ఓ జలపాతం సమీపంలో లోతైన లోయలో పోలీసులు గుర్తించారు. అతడి శరీరంపై కత్తి గాయాలు ఉండటంతో పోలీసులు హత్యగా అనుమానించారు. అతడి తలకు బలమైన గాయాలు, శరీరంపై కత్తి గాయాలు అయినట్లు శవ పరీక్షలో తాజాగా తేలింది. ఇదిలాఉంటే.. నిందితులు, మృతుడు ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మేఘాలయలో ఎదురుపడ్డ వారు మాట్లాడుకున్నారని తెలుస్తోంది. ఇండోర్‌కు చెందిన విశాల్‌సింగ్ చౌహాన్ (22), రాజ్‌సింగ్ కుశ్వాహా (21), ఉత్తర్‌ప్రదేశ్‌లోని లలిత్‌పుర్‌కు చెందిన ఆకాశ్ రాజ్‌పూత్ (19) ను ఈ కేసులో అరెస్టు చేశారు. రఘువంశీని తాను చంపించలేదని, తననే ఎవరో అపహరించారని సోనమ్ చెప్పడం గమనార్హం. కేసులో అరెస్టయిన రాజ్ కుశ్వాహాతో సోనమ్‌కు సాన్నిహిత్యం ఉందని సమాచారం. అతడే ఈ హత్య ప్లాన్‌ను నడిపించాడని పోలీసు వర్గాలు తెలిపాయి. అంతా సోనమ్, కుశ్వాహా ప్లాన్ ప్రకారమే జరిగింది. అయితే హత్యకు వారు ఉపయోగించిన పదునైన ఆయుధంతో అంతా తారుమారు అయినట్లు తెలుస్తోంది. "ఇలాంటి ఆయుధాన్ని సాధారణంగా మేఘాలయలో ఉపయోగించరు. దాంతో బయటివ్యక్తి ప్రమేయం ఉందని మాకు అనుమానం వచ్చింది. తర్వాత మేం కాల్ రికార్డులను పరిశీలించాం" అని పోలీసు అధికారి వెల్లడించారు.

# ఇరాన్‌పై దాడికి ఇజ్రాయెల్ సిద్ధం.. ఏర్పాట్లు షురూ!

ఈ కబురు: అమెరికా , ఇరాన్ అణుఒప్పందంపై చర్చించేందుకు మరోసారి సమావేశం కాబోతున్న తరుణంలో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. ఇరాన్‌పై దాడి చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. కీలక ప్రదేశాలకు ఆయుధాల తరలింపు పనులు చురుగ్గా సాగుతున్నట్లు సమాచారం. ఈ మేరకు అక్కడి మీడియాలో ప్రచారం జరుగుతోంది. గత ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా విదేశీ వ్యవహారాల నిపుణులు మేరీల్యాండ్‌లోని క్యాంప్ డేవిడ్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఇరాన్ అంశంలో అమెరికా వ్యూహం గురించి గంటలపాటు చర్చించారు. ఈ క్రమంలోనే ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు ఫోన్ చేసి దాదాపు 40 నిమిషాల పాటు మాట్లాడారు. ఆ తర్వాత నెతన్యాహు రక్షణశాఖ ఉన్నతాధికారులు, కీలక మంత్రులతో అత్యవసర భద్రత సమావేశం నిర్వహించారు. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, అణుఆయుధాల ఉత్పత్తిలో ఇరాన్ వ్యవహరిస్తున్న తీరు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. మరోవైపు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు సిద్ధమవుతున్నట్లు అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా పదేపదే చెబుతున్నాయి. అయితే, దాడుల తీవ్రత ఎలా ఉంటుంది? ఎప్పుడు దాడులు చేసే అవకాశం ఉంది? దీనిపై ఇజ్రాయెల్ ప్రభుత్వం ఇప్పటికే తుది నిర్ణయం తీసుకుందా? అనే వివరాలు మాత్రం వెల్లడించలేదు. ఒకవేళ ఇజ్రాయెల్ దాడికి పాల్పడితే దీటుగా బదులిచ్చేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రతిచర్యగా ఇజ్రాయెల్‌పై అణు ఆయుధాలను ప్రయోగించే అవకాశముందని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ డైరెక్టర్ రఫేల్ గ్రోసీ ఇజ్రాయెల్ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. "ఇరాన్ అణుస్థావరాలపై దాడి జరిగితే ఇరానియన్లు చూస్తూ ఊరుకోరు. న్యూక్లియర్ ఆయుధాన్ని ఇజ్రాయెల్‌పై ప్రయోగించే అవకాశం ఉంది. దాని తీవ్రత ఊహకందని విధంగా ఉంటుంది. అంతేకాకుండా ఇరాన్ కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముంది. అణ్వాయుధ వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ) నుంచి వైదొలగొచ్చు" అని గ్రోసీ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకోవడానికి అడుగులు వేస్తోంది. దీనిపై ఇటీవల ఒమన్‌లో ఉన్నతస్థాయి చర్చలు కూడా జరిగాయి. అయితే, అమెరికా ప్రతిపాదనను ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ విమర్శించారు. యూఎస్ ప్రతిపాదన తమ చర్యలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించారు. న్యూక్లియర్ డీల్ కుదరకపోతే సైనిక చర్యలకు దిగుతామంటూ ట్రంప్ హెచ్చరికలు కూడా చేశారు. మరోసారి అమెరికా చర్చలకు సిద్ధమవుతున్న క్రమంలో ఈసారి కూడా 'నో' చెప్పే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అన్ని వైపుల నుంచి ఆ దేశంపై ఒత్తిడి పెంచేందుకే ఇజ్రాయెల్‌ను అమెరికా పురిగొలిపినట్లు తెలుస్తోంది.



## టీవీఎస్ కొత్త మోటార్ సైకిల్ ఆవిష్కరణ.. ధర ఎంతంటే..

టీవీఎస్ సంస్థ అపాచీ కొత్త మోడల్‌ను ఆవిష్కరించింది. తాజాగా 2025 అపాచీ ఆర్‌టీఆర్ 200 4వీను విడుదల చేసింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఓబీడీ2బీ ఉద్గార ప్రమాణాలతో ఈ మోడల్‌ను లాంచ్ చేసినట్లు కంపెనీ తెలిపింది. ఈ వాహనం ధర రూ.1,53,990(ఎక్స్‌షోరూమ్)గా నిర్ణయించినట్లు పేర్కొంది. వేరియంట్ల వారీగా ధరల్లో హెచ్చుతగ్గులుంటాయని చెప్పింది.

ఈ అపాచీ మోడల్‌లో అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించినట్లు కంపెనీ తెలిపింది. అద్భుతమైన పనితీరు కోసం భద్రతా ఫీచర్లను సైతం మెరుగుపరిచినట్లు చెప్పింది. ఫీచర్లు కింది విధంగా ఉన్నాయి.

**ఓబీడీ2బీ కాంప్లయన్స్:** కఠినమైన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఉంటుంది.

37ఎంఎం అప్‌సైడ్ డౌన్ ఫ్రంట్ సస్పెన్షన్: హ్యాండ్లింగ్, స్థిరత్వాన్ని మెరుగుపరుస్తుంది.

హైడ్రోఫార్మింగ్ హ్యాండిల్ బార్: నియంత్రణను మెరుగుపరుస్తుంది. వైబ్రేషన్‌ను తగ్గిస్తుంది.

డ్యూయల్ ఛానల్ ఏబీఎస్: బ్రేకింగ్ భద్రతను అందిస్తుంది.

**3 రైడ్ మోడ్స్: అర్బన్, స్పోర్ట్, రెయిన్.**

**స్లిప్పర్ క్లచ్: స్మూత్ గేర్ షిఫ్ట్‌ల కోసం ఉపయోగపడుతుంది.**




## ప్రభుత్వానికి ఎస్‌బీఐ భారీ డివిడెండ్ రూ. 8,077 కోట్లు చెల్లింపు




**న్యూఢిల్లీ:** పీఎస్‌యూ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి(2024-25) షేరుకి రూ. 15.9 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. దీంతో సంస్థ ప్రమోటర్ కేంద్ర ప్రభుత్వానికి దాదాపు రూ. 8,077 కోట్ల డివిడెండ్ చెల్లించింది. ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు, ఫైనాన్స్ సెక్రటరీ అజయ్ సేథ్ సమక్షంలో ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తాజాగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు డివిడెండ్ చెక్ అందించారు. కాగా.. అంతక్రితం ఏడాదిలో షేరుకి రూ. 13.7 చొప్పున ప్రభుత్వానికి రూ. 6,959 కోట్లకుపైగా డివిడెండ్ చెల్లించిన సంగతి తెలిసిందే. గతేడాది ఎస్‌బీఐ 16 శాతం అధికంగా రూ. 70,901 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు 2023-24లో రూ. 61,077 కోట్ల లాభం సాధించింది.



## పసిడి ప్రియులకు ఊరట! తులం ఎంతంటే..



ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర ఇటీవలి కాలంలో క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం పసిడి ధరలు కొంత తగ్గి కొనుగోలుదారులకు ఊరట కల్పించింది. వివిధ ప్రాంతాల్లో ఈ రోజు గోల్డ్ రేట్లు ఎలా ఉన్నాయో ఈ కథనంలో తెలుసుకుందాం.

హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ప్రొద్దుటూరు, బెంగళూరు, ముంబై ప్రాంతాల్లో ఒక తులం బంగారం ధరలు రూ.89,450 (22 క్యారెట్స్), రూ.97,580 (24 క్యారెట్స్) వద్ద ఉన్నాయి. ఈ రోజు 10 గ్రాముల బంగారం ధర వరుసగా రూ.100, రూ.110 తగ్గింది.చెన్నైలో మంగళవారం 10గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరలు రూ.100, 24క్యారెట్ల 10గ్రాముల గోల్డ్ రేటు రూ.110తగ్గింది. దీంతో గోల్డ్ రేటు రూ.89,450 (22 క్యారెట్స్ 10 గ్రామ్స్ గోల్డ్), రూ.97,580 (24 క్యారెట్స్ 10 గ్రామ్ గోల్డ్)కు చేరింది.దేశ రాజధాని నగరం దిల్లీలో బంగారం ధర నిన్నటితో పోలిస్తే తగ్గింది. ఈ రోజు 10 గ్రాముల 22 క్యారెట్స్ పసిడి ధర రూ.100 దిగి రూ.89,600కు చేరుకోగా.. 24 క్యారెట్ల ధర రూ.110 తగ్గి రూ.97,730 వద్దకు చేరింది.

**వెండి ధరలు**

బంగారం ధరల మాదిరిగా కాకుండా సోమవారంతో పోలిస్తే మంగళవారం వెండి ధరలుపెరిగాయి. క్రితం ముగింపు ధరలతో పోలిస్తే మంగళవారం కేజీ వెండి ధర రూ.1,000 పెరిగింది. దాంతో కేజీ వెండి రేటు రూ.1,19,000 వద్దకు చేరింది.

## ఫ్లాట్‌గా కదలాడుతున్న స్టాక్ మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గడిచిన సెషన్‌తో పోలిస్తే మంగళవారం స్థిరంగా కదలాడుతున్నాయి. ఈ రోజు ఉదయం 09:45 సమయానికి నిఫ్టీ 14 పాయింట్లు లాభపడి 25,114కు చేరింది. సెన్సెక్స్ 28 పాయింట్లు దిగజారి 82,415 వద్ద ట్రేడవుతోంది.

అమెరికా డాలర్ ఇండెక్స్99.24 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 67.22 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.48 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.09 శాతం లాభపడింది. నాస్‌డాక్ 0.31 శాతం పుంజుకుంది.

బ్యాంకుల లిక్విడిటీ పెంపు, వడ్డీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం చివర్లో జోరందుకున్నాయి. ఈ ప్రభావం ఇకపైన సైతం కనిపించే వీలున్నట్లు స్టాక్ విశ్లేషకులు భావిస్తున్నారు. రియల్టీ, బ్యాంకింగ్, ఆటో, కన్జూమర్ రంగాలలో యాక్టివిటీ కొనసాగవచ్చని పేర్కొన్నారు. అయితే రుతుపవనాల కదలికలు, దేశ, విదేశీ ఆర్థిక గణాంకాలు, యూఎస్, భారత్ వాణిజ్య చర్చలు తదితర పలు ఇతర అంశాలు సైతం సెంటిమెంటును ప్రభావితం చేయనున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాది మే చివర్లోనే ఆశలు రేపిన రుతుపవనాలు ప్రస్తుతం మందగించాయి. ఇకపై వీటి కదలికలపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు.





## ఆతిథ్య రంగంలో 6—8 శాతం వృద్ధి

**ఈ రంగానికి స్థిరమైన అవుట్‌లుక్**
**మధ్యకాలానికి సానుకూల డిమాండ్**
**గదుల టారిఫ్‌లు పెరుగుతాయి**
**రేటింగ్ సంస్థ ఇక్రా నివేదిక**


**న్యూఢిల్లీ:** దేశ ఆతిథ్య రంగం (హాస్పిటాలిటీ) ఈ ఆర్థిక సంవత్సరంలో 6-8 శాతం మధ్య వృద్ధి చెందొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. ఈ రంగానికి అవుట్‌లుక్‌ను సానుకూలం నుంచి స్థిరత్వానికి తగ్గించింది. జమ్మూ కశ్మీర్లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో వచ్చే కొన్ని నెలల పాటు భారత్‌కు విదేశీ పర్యాటకుల రాక స్తబ్దుగా ఉంటుందని, ఆ తర్వాత నుంచి క్రమంగా పుంజుకోవచ్చని తెలిపింది. ఆతిథ్య రంగానికి దేశీ పర్యాటకం ఇప్పటి వరకు కీలక చోదకంగా ఉండగా, సమీప కాలంలోనూ ఇదే ధోరణి కొనసాగుతుందని అంచనా వేసింది.

మౌలిక సదుపాయాలు, విమాన సేవల అనుసంధానత మెరుగుపడడం, జనాభా పరంగా సానుకూలత, ఎంఐసీఈ కార్యక్రమాలు పెరగడం, గత కొన్నేళ్లలో కొత్త కన్వెన్షన్ సెంటర్లు అందుబాటులోకి రావడం మధ్యకాలంలో ఆతిథ్య రంగంలో వృద్ధికి సానుకూలిస్తాయని ఇక్రా తెలిపింది. 2025-26లో ఆతిథ్య రంగం ఆదాయాలు, రుణ పరిస్థితులు స్థిరంగా ఉంటాయని పేర్కొంది. సానుకూల అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్య కాలంలో అప్‌గ్రేడ్‌ను సూచిస్తే.. స్థిరమైన అవుట్‌లుక్ అన్నది సమీప కాలం నుంచి మధ్యకాలంలో మార్పులేమిని సూచిస్తుంది.


**72-74 శాతం ఆక్యుపెన్సీ**

దేశవ్యాప్తంగా ప్రీమియం హోటళ్లలో ఆక్యుపెన్సీ (గదుల బుకింగ్) 2025-26 సంవత్సరంలో 72-74 శాతం మధ్య ఉండొచ్చన్నది ఇక్రా అంచనా. 2023-24లో నమోదైన 70-72 శాతంతో పోల్చితే కాస్త పెరగనుంది. ప్రీమియం హోటళ్లలో సగటు రూమ్ ధరలు రూ.8,200-8,500 మధ్య ఉండొచ్చని ఇక్రా తెలిపింది. 2024-25లో ఈ ధరలు రూ.8,000-8,200 మధ్య ఉన్నట్టు వెల్లడించింది. కొన్ని హోటళ్లు నవీకరణ చేపట్టడం, సరఫరా పెరగకపోవడంతో ధరలు పెరగనున్నట్టు పేర్కొంది. "మూడేళ్లపాటు వరుసగా బలమైన డిమాండ్‌ను ఆతిథ్య పరిశ్రమ చూసింది.

దేశీ విహార పర్యటనలు, సమావేశాలు, సదస్సులకు (ఎంఐసీఈ) డిమాండ్, వివాహాలు, వ్యాపార పర్యటనలు ఇందుకు అనుకూలించాయి. కానీ, 2025-26లో 6-8 శాతం మేర మోస్తరు వృద్ధికి పరిమితం కావొచ్చు"అని ఇక్రా లిమిటెడ్ కార్పొరేట్ రేటింగ్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జితిన్ మక్కర్ తెలిపారు. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడి, మే నెలలో ఉత్తర, పశ్చిమ భారత్‌లో అనిశ్చితులు పెరగడంతో ప్రయాణ, ఎంఐసీఈ కార్యక్రమాల రద్దులు పెరిగినట్టు చెప్పారు. ఇటీవలి వారాల్లో డిమాండ్ కోలుకుంటున్నట్టు తెలిపారు. ఆదాయంలో వృద్ధి తక్కువగానే ఉన్నప్పటికీ.. 13 బడా హోటల్ కంపెనీలు 34-36 శాతం మధ్య మార్జిన్లు నమోదు చేయొచ్చని ఇక్రా అంచనా వేసింది. వ్యయ నియంత్రణలు, అస్సెట్ లైట్ (అద్దెకు తీసుకోవడం) నమూనా మార్జిన్లకు మద్దతునిస్తాయని తెలిపింది.



# తండ్రి బర్త్ డే.. ఆయన లక్ష్యం దిశగా దీపికా పదుకొణె!



బాలీవుడ్ భామ దీపికా పదుకొణె తన తండ్రికి సర్‌ప్రైజ్ ఇచ్చింది. ప్రముఖ బ్యాడ్మింటన్ ప్లేయర్ అయిన తన తండ్రి బర్త్ డే సందర్భంగా గొప్ప కార్యక్రమం చేపట్టింది. ప్రకాశ్ పదుకొణె 70వ పుట్టినరోజు సందర్భంగా పదుకొణె స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్‌ను ప్రారంభించింది. ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకుంది. తన తండ్రి, బ్యాడ్మింటన్ దిగ్గజ క్రీడాకారుడు ప్రకాశ్ పదుకొనేకు అంకితమిస్తున్నట్లు వెల్లడించింది.

దీపికా తన ఇన్‌స్టాలో రాస్తూ.. "బ్యాడ్మింటన్ ఆడుతూ పెరిగిన వ్యక్తిగా.. ఈ క్రీడ ఒకరి జీవితాన్ని శారీరకంగా, మానసికంగా, భావోద్వేగపరంగా ఎంతగా మారుస్తుందో నేను ప్రత్యక్షంగా అనుభవించా. పదుకొణె స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్ ద్వారా అన్ని వర్గాల ప్రజలకు బ్యాడ్మింటన్ ఆడితే కలిగే ఆనందం, క్రమశిక్షణ అందించాలని అనుకుంటున్నా. ఆరోగ్యకరమైన క్రీడ ద్వారా ప్రేరణ పొందిన తరాన్ని నిర్మించాలని మేము ఆశిస్తున్నాం. డాడీ, మీ గురించి బాగా తెలిసిన వారికి.. ఈ క్రీడ పట్ల మీకెంత మక్కువో తెలుసు. 70 ఏళ్ల వయసులో కూడా తినడం, నిద్రపోవడం, బ్యాడ్మింటన్ ఆడడమే మీ ప్రపంచం. అందుకే మీ ఇష్టాన్ని నిజం చేయడానికి మేమంతా కట్టుబడి ఉన్నాం. బ్యాడ్మింటన్ ఫర్ ఆల్! మీకు 70వ పుట్టినరోజు శుభాకాంక్షలు పప్పా" అంటూ పోస్ట్ చేసింది.

కాగా.. పదుకొణె స్కూల్ ఆఫ్ బ్యాడ్మింటన్ ఇప్పటికే పలు నగరాల్లో స్థాపించారు. దాదాపు ఇప్పటికే 75 కేంద్రాల్లో నెలకొల్పారు. కాగా.. ఆమె తండ్రి ప్రకాశ్ పదుకొణె మాజీ ప్రపంచ నంబర్ వన్ మాత్రమే కాదు.. బ్యాడ్మింటన్‌లో ఆల్-ఇంగ్లాండ్ ఛాంపియన్‌గా నిలిచారు. ఇక సినిమాల విషయానికొస్తే గతేడాది కల్కి మూవీలో మెప్పిం దీపికా.. ప్రస్తుతం అల్లు అర్జున్- అట్లీ కాంబోలో రానున్న చిత్రంలో ఛాన్స్ కొట్టేసింది. ఈ విషయ అధికారికంగా ప్రకటించారు.

# 'నా చావు గురించి మాట్లాడినందుకు ధన్యవాదాలు'.. అమితాబ్ ఘాటు రిప్లై!




బిగ్‌బీ అమితాబ్‌కు ఆసక్తికర అనుభవం ఎదురైంది. అమితాబ్ బచ్చన్ సోషల్ మీడియాలో నెటిజన్లతో ఓ సెషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్యానికి సంబంధించిన సలహాలు ఇచ్చారు బిగ్ బీ. మీ గాడ్జెట్స్‌ను బ్రేక్ చేయండి.. మీకు దీర్ఘాయుస్సు ఉంటుందని అమితాబ్ పోస్ట్ పెట్టారు.

ఇది చూసిన ఓ నెటిజన్ అమితాబ్‌కు షాకింగ్ రిప్లై ఇచ్చాడు. 'మీరు సమయానికి నిద్రించడానికి ప్రయత్నించండి..లేకపోతే ఎక్కువ కాలం జీవించలేరు' అంటూ కామెంట్ చేశాడు. అయితే ఈ పోస్ట్‌కు బిగ్‌బీ అమితాబ్ తనదైన స్టైల్లోనే నెటిజన్‌కు ఇచ్చిపడేశాడు. నా మరణం గురించి మాట్లాడినందుకు మీకు ధన్యవాదాలు.. అంతా ఆ ఈశ్వరుని దయ' అంటూ చేతులెత్తి నమస్కరించే ఎమోజీ జతచేశాడు.

ఆ తర్వాత అమితాబ్ ఆరోగ్యం, జీవితం గురించి వరుసగా పోస్టులు పెట్టారు. మన జీవితాన్ని గడపడానికి ఉత్తమ మార్గానికి సంబంధించిన సూత్రాలను అభిమానులు, నెటిజన్లతో పంచుకున్నారాయన. ఇక సినిమాల విషయానికొస్తే గతేడాది కల్కి మూవీతో అభిమానులను అలలరించాడు. ప్రస్తుతం కల్కి-2లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా 'కౌన్ బనేగా కరోడ్‌పతి' నెక్ట్స్ సీజన్ హోస్ట్ చేయడానికి రెడీగా ఉన్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' సెట్‌లోకి పవన్ ఎంట్రీ!




పవన్ కల్యాణ్ పెండింగ్ పెట్టిన ప్రాజెక్టుల్లో ఉస్తాద్ భగత్ సింగ్' ఒకటి. హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఎన్నికల ముందే ప్రారంభం అయింది. కొన్నాళ్లకే ఎన్నికలు రావడం..పవన్ బిజీ అయిపోవడంతో ఈ సినిమా షూటింగ్ నిలిచిపోయింది. చాలా కాలం తర్వాత మళ్లీ ఈ చిత్రం సెట్‌పైకి వెళ్లింది. ఇటీవల ఈ సినిమా కొత్త షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ రోజు పవన్ కల్యాణ్ అఫీషియల్ గా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు.

ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. పవన్ కళ్యాణ్ తో పాటు, సినిమాలోని ప్రముఖ తారాగణం కూడా షూటింగ్‌లో పాల్గొంటోంది. పవన్ ఎంట్రీతో సెట్స్‌లో జోష్ నెలకొంది అని చిత్రబృందం పేర్కొంది. మైత్రి మూవీ మేకర్స్ బ్యానరర్ పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# కత్రినా కైఫ్‌కు క్రేజీ ఛాన్స్.. ఆ దేశానికి బ్రాండ్ అంబాసిడర్‌గా!



బాలీవుడ్ భామ కత్రినా కైఫ్‌కు అరుదైన ఛాన్స్ దక్కింది. ఆమె పర్యాటక అభివృద్ధికి అంబాసిడర్‌గా ఎంపికైంది. అయితే కత్రినాను ఎంపిక చేసింది మాత్రం మన దేశానికి కాదు. గతేడాది మనదేశంతో దౌత్యపరమైన వివాదానికి తెరలేపిన దేశానికి ఆమె గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. ఆ దేశం మరెదో కాదు.. మన దగ్గర్లోనే ఉన్న మాల్దీవుస్.

కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు ప్రపంచ పర్యాటక రాయబారిగా నియమించినట్లు మాల్దీవుల మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ వెల్లడించింది. భారత చిత్ర పరిశ్రమలో ప్రముఖ వ్యక్తి అయిన కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం పట్ల తాము సంతోషంగా ఉన్నామని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేందుకు బాలీవుడ్ హీరోయిన్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ అవకాశం రావడంపై బాలీవుడ్ భామ కత్రినా కైఫ్ స్పందించింది. గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై సంతోషం వ్యక్తం చేసింది. మాల్దీవులు అందించే లగ్జరీ, అందాలను సూచించడానికి ఉత్సాహంగా ఉన్నట్లు పేర్కొంది.

గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా తన కొత్త రోల్ గురించి కత్రినా మాట్లాడుతూ.. 'మాల్దీవులు లగ్జరీ, సహజ సౌందర్యానికి కేరాఫ్ అడ్రస్. చక్కని ప్రశాంతంగా ఉండే ప్రదేశం. సన్నీ సైడ్ ఆఫ్ లైఫ్‌గా ఎంపికైనందుకు నేను గౌరవంగా భావిస్తున్నా. ఈ సహకారం ప్రపంచ పర్యాటక ప్రేక్షకులకు అత్యుత్తమ ప్రయాణ అనుభవాలను తీసుకురావడం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు ఈ అద్భుతమైన గమ్యస్థానం, ప్రత్యేకమైన ఆకర్షణ, ప్రపంచ స్థాయిలో పేరు పొందేలా సహాయపడటానికి ఉత్సాహంగా ఉన్నానని" తెలిపింది. అయితే ప్రధాని మోదీ పర్యటనకు ముందు ఈ ప్రకటన రావడం విశేషం. వచ్చే నెలలో మాల్దీవుస్‌లో ప్రధాని పర్యటించనున్నారు.



# డంప్‌యార్డ్‌లో షూటింగ్.. రష్మికకు ఏమైందో నాకు తెలియదు: ధనుష్

**ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో రూపొందిన సినిమా 'కుబేర'. ఈ సినిమా సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో రష్మికపై ధనుష్ ఫన్నీ కామెంట్స్ చేశారు.**

**ముంబయి:** డంప్‌యార్డ్‌లో దాదాపు 7 గంటలపాటు చిత్రీకరణలో పాల్గొన్నా రష్మిక ఇబ్బందిగా ఫీలవలేదని, ఆమెకు అసలు చెడు వాసనే రాలేదంటూ ధనుష్ నవ్వులు పూయించారు. ఈ ఇద్దరు, నాగార్జున ప్రధాన పాత్రలో దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన సినిమా 'కుబేర' . ఈ మూవీ ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'పీ పీ డుమ్ డుమ్' పాట విడుదల వేడుకను ముంబయిలో మంగళవారం నిర్వహించారు.

**'కుబేర' చాలా స్పెషల్: ధనుష్**

''నా కెరీర్‌లో 'కుబేర' చాలా ప్రత్యేకమైంది. ఈ సినిమా చిత్రీకరణ ఎన్నో విషయాలు నేర్పింది. ఈ చిత్రంతో మంచి వ్యక్తులు పరిచయమయ్యారు. ఈ మూవీలో నేను బెగ్గర్‌గా నటించా. 'ఈ పాత్ర కోసం ఎంతో రీసెర్చ్, హోమ్ వర్క్ చేశా' అని చెప్పను (నవ్వులు). శేఖర్ కమ్ముల సర్ చెప్పింది చేసుకుంటూ వెళ్లా. సవాలుతో కూడిన ఈ ప్రయాణాన్ని ఆస్వాదించా. శేఖర్ మంచి మనిషి. అందరితోనూ స్నేహపూర్వకంగా ఉంటారు. ఆయన 20 నిమిషాల్లో ఈ సినిమా స్క్రిప్టు వినిపించారు. ఆయనెంత పాజిటివ్‌గా ఉంటారో అప్పుడే అర్థమైంది. ఓ డంప్‌యార్డ్‌లో దాదాపు 7 గంటలపాటు నేను, రష్మిక షూటింగ్‌లో పాల్గొన్నాం. అక్కడ అంతసేపు ఉన్నా ఆమె బాగానే ఉంది. 'నాకేం వాసన రావట్లేదు' అని చెప్పింది. మరి ఆమెకు ఏమైందో నాకు తెలియదు (నవ్వులు). ఇలా ఎన్నో మంచి జ్ఞాపకాలు పంచిందీ చిత్రం''

''కుబేర' మూవీ మాకు పెద్ద ఛాలెంజ్ అంటూ వచ్చిన కొన్ని వార్తలు చదివా. అదేం కాదు. మేం సరదాగా చిత్రీకరణ పూర్తి చేశాం. నేను ఎక్కడి నుంచి వచ్చానో.. మళ్లీ అక్కడికి వెళ్లి గత జ్ఞాపకాలు నెమరువేసుకున్నానంతే'' అని ధనుష్ పేర్కొన్నారు. సినిమాసినిమాకు వైవిధ్యం ఎలా చూపించగలుగుతున్నారు? అని ప్రశ్నించగా.. ''నేను ప్రాసెసర్‌లాంటి వాడిని. ఆయా పాత్రల విషయంలో దర్శకులు ఎక్కువగా కష్టపడతారు. వారి ఇచ్చిన ఇన్‌పుట్స్‌ని నేను ప్రాసెస్ చేశా. ఈ విషయంలో క్రెడిట్ మొత్తం నా డైరెక్టర్స్‌దే'' అని తెలిపారు.



# ధోని అంటే కూల్ అండ్ కామ్!

**హేంద్రసింగ్ ధోనికి ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పలువురు మాజీ క్రికెటర్లు అతడి గురించి మాట్లాడారు. టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనికి ఐసీసీ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు మాజీ క్రికెటర్లు ధోని గురించి మాట్లాడారు.**

**అతడో అద్భుతం**

'ఎంఎస్ ధోని ఓ అద్భుతమైన ఆటగాడు. భారత్‌కు వరల్డ్ కప్‌ను అందించిన గొప్ప క్రికెటర్. తన జట్టులోని ఆటగాళ్ల బలాలేంటో ఓ కెప్టెన్‌గా అతడికి తెలుసు. అందుకే వాటిని జట్టు కోసం పూర్తిస్థాయిలో ఉపయోగించాడు. భారత్.. వరల్డ్ కప్ గెలుచుకునేలా కృషి చేశాడు. ఐపీఎల్‌లోనూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జట్టును అయిదుసార్లు టైటిల్ విజేతగా నిలిపాడు.' అని దినేశ్ కార్తిక్ అన్నాడు.

**వేగానికి పెట్టింది పేరు**

'ఎంఎస్ ధోని వేగానికి పెట్టింది పేరు. కళ్లు మూసి తెరిచేంతలో చాలా స్పీడ్‌గా స్టంపింగ్ చేయడంలో దిట్ట. అలాగే క్రికెట్‌లో సాధారణంగా కెప్టెన్లు తీవ్రమైన ఒత్తిడిలో ఉంటారు. కానీ ధోని ఎప్పుడూ ఒత్తిడిలో కనిపించలేదు. మైదానంలో కూల్ అండ్ కామ్‌గా ఉండేవాడు. సారథిగా సరైన నిర్ణయాలు తీసుకునేవాడు' అని నాసిర్ హుస్సేన్ కొనియాడాడు.

**హెలికాప్టర్ షాట్లతో..**

'ఎంఎస్ ధోని హెలికాప్టర్ షాట్లతో పరుగులు రాబట్టాడు. జట్టుకు అవసరమైన సమయంలో అద్భుతంగా రాణించేవాడు' అని రికీపాంటింగ్ అన్నాడు.

**నాకు చాలా గౌరవం..**

'ఎంఎస్ ధోని అంటే నాకు ఎంతో గౌరవం. చాలా ఏళ్లు అతడు క్రికెట్‌కు సేవలందించాడు. జట్టును ఎన్నోసార్లు గెలిపించాడు. అతడు ఆడిన విధానం అద్భుతం' అని ఏబీ డివిలియర్స్ అభిప్రాయం వ్యక్తంచేశాడు.

# డబ్ల్యూటీసీ ఫైనల్.. తుది జట్లను ప్రకటించిన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా






**జూన్ 11 నుంచి లార్డ్స్ వేదికగా 2023-2025 డబ్ల్యూటీసీ ఫైనల్ మొదలుకానుంది.**

ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ మూడో ఎడిషన్ తుది దశకు చేరుకుంది. జూన్ 11 నుంచి లార్డ్స్ వేదికగా 20232025 డబ్ల్యూటీసీ ఫైనల్ మొదలుకానుంది. తుది పోరులో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తలపడనున్న విషయం తెలిసిందే. ఫైనల్ మ్యాచ్ కోసం ఇరు దేశాలు తమ తుది జట్లను ప్రకటించాయి. ఆసీస్ ఆటగాడు కామెరూన్ గ్రీన్ తిరిగి ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. అతను మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగనున్నాడు. ఇక, మార్నస్ లబుషేన్ కెరీర్‌లో తొలిసారిగా ఓపెనర్‌గా రానున్నాడు.

**ప్రైజ్ మనీ ఎంతంటే?**

ఛాంపియన్‌గా నిలిచిన జట్టు గదతో పాటు 3.6 మిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.30 కోట్ల 80 లక్షలు) ప్రైజ్‌మనీని దక్కించుకోబోతోంది. 2023తో పోలిస్తే ఇది రెట్టింపు కన్నా ఎక్కువే కావడం విశేషం. గత ఛాంపియన్ ఆస్ట్రేలియా 1.6 మిలియన్ డాలర్ల నగదు బహుమతిని అందుకుంది. ఈసారి రన్నరప్‌గా నిలిచే జట్టు 2.1 మిలియన్ డాలర్లు (రూ.17 కోట్ల 94 లక్షలు) చేజిక్కించుకోనుంది. గత ఛాంపియన్‌షిప్‌లో రన్నరప్‌గా భారత్‌కు 8 లక్షల డాలర్లు మాత్రమే లభించాయి.

**ఆసీస్ తుది జట్టు:** **ఉస్మాన్ ఖవాజా, మార్నస్ లబుషేన్, కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్, బ్యూ వెబ్‌స్టర్, అలెక్స్ కెరీ (వికెట్‌కీపర్), పాట్ కమిన్స్ (కెప్టెన్), మిచెల్ స్టార్క్, నాథన్ లైయన్, జోష్ హేజిల్‌వుడ్.**

**దక్షిణాఫ్రికా తుది జట్టు:** **తెంబా బావుమా (కెప్టెన్), ఐడెన్ మార్‌క్రమ్, ర్యాన్ రికెల్‌టన్, వియాన్ ముల్డర్, ట్రిస్టన్ స్టబ్స్, డేవిడ్ బెడింగ్‌హామ్, కైల్ వెరినే, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, కగిసో రబాడ, లుంగి ఎంగిడి.**




# కౌంటీ క్రికెట్ ఆడనున్న రుతురాజ్ గైక్వాడ్

**భారత యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు.**

భారత యువ బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు. అతడిని జట్టులోకి తీసుకుంటున్నట్లు యార్క్‌షైర్ ప్రకటించింది. కౌంటీ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు, వన్డే కప్‌నకు రుతురాజ్ అందుబాటులో ఉంటాడు. కౌంటీ ఛాంపియన్ షిప్‌లో భాగంగా జులైలో సర్రేతో జరిగే మ్యాచ్‌లో రుతురాజ్ యార్క్‌షైర్ జట్టుతో చేరతాడు. సీజన్ ముగిసే వరకు జట్టులోనే ఉంటాడు. ప్రస్తుతం రుతురాజ్ ఇంగ్లండ్‌లోనే ఉన్నాడు. ఇంగ్లండ్ లయన్స్, భారత్‌ఎ మధ్య రెండు అనధికార టెస్టుల కోసం అక్కడికి వెళ్లాడు. అయితే, ఈ రెండు టెస్టుల్లో రుతురాజ్‌కు ఆడే అవకాశం రాలేదు.

'ఇంగ్లండ్ దేశవాళీ సీజన్‌లో యార్క్‌షైర్ జట్టులో చేరుతున్నందుకు నేను సంతోషిస్తున్నాను. ఈ దేశంలో క్రికెట్ అనుభవం సంపాదించడం నా లక్ష్యం. యార్క్‌షైర్ కంటే ఇంగ్లండ్‌లో పెద్ద క్లబ్ మరొకటి లేదు' అని రుతురాజ్ పేర్కొన్నాడు. సచిన్ తెందూల్కర్, యువరాజ్ సింగ్, ఛెతేశ్వర్ పుజారా కూడా యార్క్‌షైర్ తరఫున ఆడారు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2025లో చెన్నై సూపర్ కింగ్స్‌కు కెప్టెన్‌గా ఉన్న రుతురాజ్ కొన్ని మ్యాచ్‌ల తర్వాత మోచేయి గాయం బారినపడి సీజన్ మొత్తానికి దూరమైన సంగతి తెలిసిందే.




# కొత్త తరం ఫ్యాబ్-4 ఎవరో చెప్పిన కేన్ విలియమ్సన్..

**భారత్ నుంచి ఇద్దరు ఆటగాళ్లు**

**న్యూజిలాండ్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ తన తర్వాతి తరం ఫ్యాబ్-4 ఆటగాళ్లు ఎవరో అంచనా వేశాడు.**

న్యూజిలాండ్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ తన తర్వాతి తరంలో అన్ని ఫార్మాట్‌లలో ఆధిపత్యం చెలాయించే ఆటగాళ్లు ఎవరో అంచనా వేశాడు. ఇద్దరు భారత ఆటగాళ్లు ఉండటం విశేషం. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ మార్టిన్ క్రోవ్ 2014లో విలియమ్సన్, జో రూట్, స్టీవ్ స్మిత్, విరాట్ కోహ్లీని ఫ్యాబ్ 4గా అభివర్ణించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఈ నలుగురిని ఫ్యాబ్ 4గా పరిగణిస్తున్నారు. ఇప్పుడు ఈ ఆటగాళ్ల కెరీర్ చరమాంకానికి వచ్చింది. దీంతో కొత్త తరం ఫ్యాబ్ 4 ఎవరనే చర్చ మొదలైంది. ఇటీవల విలియమ్సన్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొనగా అతనికి ఇదే ప్రశ్న ఎదురైంది. దీనికి కేన్ ఇలా స్పందించాడు. 'అన్ని ఫార్మాట్ల పరంగా చూసుకుంటే యశస్వి జైస్వాల్ , శుభ్‌మన్ గిల్, రచిన్ రవీంద్ర, హ్యారీ బ్రూక్ ఈ జాబితాలో ముందుంటారు. కామెరూన్ గ్రీన్ కూడా రేసులో ఉన్నాడు. వీరంతా అత్యుత్తమ ఆటగాళ్లు. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్‌లలో అద్భుతమైన ప్రదర్శన చేశారు. పైగా వీరందరూ యువ ఆటగాళ్లు. ఇప్పుడిప్పుడే కెరీర్‌పరంగా ఎదుగుతున్నారు' అని విలియమ్సన్ పేర్కొన్నాడు.

కొంతకాలంగా గిల్, జైస్వాల్, బ్రూక్, రచిన్ రవీంద్ర తమ తమ దేశాల తరఫున అదరగొడుతున్న సంగతి తెలిసిందే. గిల్ ఇటీవల భారత టెస్టు కెప్టెన్‌గా ప్రమోషన్ పొందాడు. 23 ఏళ్ల యశస్వి జైస్వాల్ టెస్టుల్లో తనదైన మార్కు చూపించి తక్కువ కాలంలోనే జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. టీ20ల్లోనూ అదరగొడుతున్నాడు. అయితే, జైస్వాల్‌కు వన్డేల్లో పెద్దగా అవకాశం దక్కలేదు. ఇప్పటివరకు ఒకే వన్డే మ్యాచ్ ఆడాడు. ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ 25 టెస్టుల్లో 58.47 సగటుతో 2,339 రన్స్ చేశాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లోనూ రాణిస్తున్నాడు. వన్డే, టీ20 జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరిస్తున్నాడు. కివీస్ బ్యాటర్ రచిన్ రవీంద్ర టెస్టులు, వన్డేల్లో రాణిస్తున్నాడు. టీ20ల్లో మాత్రం అతను పెద్దగా ప్రభావం చూపట్లేదు.

# ఆ దుర్ఘటన జరగకుండా ఉండాల్సింది: రాహుల్ ద్రవిడ్

ఆర్సీబీ విజయోత్సవం సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనపై టీమ్‌ఇండియా మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ విచారం వ్యక్తం చేశాడు. ఆ దుర్ఘటన జరగకుండా ఉండాల్సిందన్నాడు.ఐపీఎల్ 2025 టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 4న, బెంగళూరులో జరిగిన ఆర్సీబీ విజయోత్సవంలో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 11 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో అభిమానులు గాయాలపాలయ్యారు. దీనిపై టీమ్‌ఇండియా మాజీ కోచ్, క్రికెటర్ రాహుల్ ద్రవిడ్ విచారం వ్యక్తం చేశాడు. ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన జరగకుండా ఉండాల్సిందన్నాడు.

'అది చాలా విచారకరమైన ఘటన. బెంగళూరు ప్రజలకు క్రీడలంటే చాలా ఇష్టం. నేను కూడా ఈ ప్రాంతం నుంచే వచ్చాను. ఇక్కడి వారు క్రికెట్‌ను మాత్రమే కాకుండా అన్ని క్రీడలనూ ఆదరిస్తారు. ఫుట్ బాల్ టీమ్ అయినా, కబడ్డీ టీమ్ అయినా.. అన్ని జట్లనూ అనుసరిస్తారు. ఇలాంటి దురదృష్టకర సంఘటన జరగడం నిజంగా హృదయ విదారకం. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పిస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని రాహుల్ ద్రవిడ్ ఓ మీడియా సంస్థతో అన్నాడు.






# పూరన్ షాకింగ్ నిర్ణయం.. 29 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

**వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు.**

వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్ నికోలస్ పూరన్ షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. 29 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇది ఎంతో కఠినమైన నిర్ణయమని తన ఇన్‌స్టా ఖాతాలో పేర్కొన్నాడు. విండీస్ తరఫున 61 వన్డేల్లో 1,983 పరుగులు, 106 టీ20ల్లో 2,275 పరుగులు చేశాడు. నిక్కీపీ అని ముద్దుగా పిలుచుకునే పూరన్.. ఇటీవల టీ20ల్లో విండీస్ జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించాడు. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. వచ్చే ఏడాది జరిగే టీ20 ప్రపంచకప్‌నకు 8 నెలల ముందే రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించి అభిమానులతోపాటు జట్టును షాక్‌కు గురి చేశాడు. ఎంతో ఆలోచించి తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాడు. తనపై ప్రేమను చూపించిన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు.

# ధోని రెప్పపాటు కాలంలో స్టంపింగ్ చేస్తాడు: రవిశాస్త్రి




**ధోని చాలావేగంగా స్టంపింగ్ చేస్తాడని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి అన్నాడు**

కళ్లు మూసి తెరిచేంతలో మహేంద్ర సింగ్ ధోని అత్యంత వేగంగా స్టంపింగ్ చేస్తాడని భారత మాజీ కోచ్, క్రికెటర్ రవిశాస్త్రి కొనియాడాడు. ధోని ఐసీసీ హాల్‌ఆఫ్ ఫేమ్‌లో స్థానం సంపాదించిన నేపథ్యంలో రవిశాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశాడు. 'ధోని చాలా వేగంగా స్టంపింగ్ చేస్తాడు. పెద్ద పెద్ద మ్యాచ్‌లు ఆడుతున్నప్పుడు ఇతర బ్యాటర్లు అతడు తమ వెనకాల ఉండొద్దు అనుకునేవారు. ఎందుకంటే అతడు రెప్పపాటులో స్టంపింగ్ చేస్తాడు' అని రవిశాస్త్రి ఐసీసీ వేడుక సందర్భంగా అన్నాడు.

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధికసార్లు స్టంపింగ్ చేసిన కీపర్‌గా ధోని రికార్డు సృష్టించాడు. తన కెరీర్‌లో 195 స్టంపింగ్‌లు చేశాడు. అలాగే మూడో అత్యంత విజయవంతమైన కీపర్‌గానూ గుర్తింపు పొందాడు. మొత్తం 829 సార్లు బ్యాటర్లను పెవిలియన్ బాట పట్టించాడు. కేవలం కీపింగ్‌లోనే కాదు.. జట్టుకు అవసరమైనప్పుడు బ్యాటింగ్‌లోనూ రాణించాడు. ముఖ్యంగా హెలికాప్టర్ షాట్‌కు ధోని పెట్టింది పేరు. కెప్టెన్‌గానూ భారత్‌కు ఎన్నో విజయాలు అందించాడు.

